ప్రజాశక్తి

మంగళవారం 6 డిసెంబర్ 2022

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఈ గాలీ, నేలా కాలుష్యం..!

◆ విశాఖలో 200 దాటిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ◆ ప్రమాదంలో పర్యావరణం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ... ప్రకృతి అందాలకు నెలవైన నగరం. చుట్టూ ఎత్తయిన కొండలు.. మూడువైపులా చుట్టేసినట్లు సముద్రం. ఆహ్లాదకరమైన వాతావరణం. అందుకే 'సిటీ ఆఫ్ డెస్టినీ'గా విశాఖకు పేరు. తాజాగా జరిగిన ఇండియన్ నేవీ డే సందర్భంగా కూడా భారత దేశపు అత్యంత సహజసిద్ధమైన నగరం విశాఖ అంటూ నిర్వాహకులు ప్రకటించిన విషయం కూడా మరువలేనిది. ఇంతటి మహా నగరానికి ఏమైంది ? అంటే.. గాలిలో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయన్నది రూఢీ అవుతోంది. అత్యంత వేడిమి పెరిగే నగరాల జాబితాల్లో విశాఖ చేరిపోవడం తాజా పరిణామం.



విశాఖ నగరంలో వాహనాల నుంచి వెలువడుతున్న పొగ

2020 నుంచీ ఎండాకాలంలో 50 డిగ్రీలు ఉష్ణోగ్రతలు దాటిపోయిన పరిస్థితి ఉంది. హుదూద్ తుపాను తర్వాత విశాఖలో వేడి మరింత పెరిగిందని ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన ఎన్విరాన్‌మెంటలిస్టులు నొక్కి చెప్పారు. పారిశ్రామిక కాలుష్యం, నగరంలో పలుచోట్ల చెరువులు, గెడ్డలను ఆక్రమించేసి చేపట్టిన భవంతుల నిర్మాణాలు నగరాన్ని ఊపిరి తీసుకోనివ్వడం లేదని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు.

నగర వాసులపై తీవ్ర ప్రభావం

పట్టణీకరణ విపరీతంగా జరుగుతున్న క్రమంలో విశాఖలో జీవిస్తున్న వారిలో గడచిన రెండు దశాబ్దాల్లో సుమారు 8 లక్షల మందికి పైగా వలస వచ్చిన వారే ఉన్నారని తెలుస్తోంది. బతుకుదెరువు కోసం ఆధారపడే నగరంగా విశాఖ వృద్ధి చెందుతోంది. జనసాంద్రత కూడా పెరగడంతో వేగంగా కాలుష్య కారకాల దాడికి గురౌతున్నారు. జివిఎంసి మానిటరింగ్ కేంద్రం (యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్) తాజాగా నవంబర్ నెలకు సంబంధించి విడుదల చేసిన నివేదిక చూస్తే ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యుఐ) 200 పాయింట్లకు చేరితే నష్టమని తెలియజేయగా తాజాగా 274 మార్కును చేరడం ఆందోళన కలిగించే అంశం. 200 అంటేనే చాలా 'పూర్ ఎయిర్ కంట్రోల్ మెజర్స్' మిగతా 2లో..

భూముల రీ సర్వేలో..

ప్రతి లోపాన్నీ సరిచేస్తాం

◆ రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు

◆ గృహాల మంజూరు పేర డబ్బులు వసూలుచేస్తే కఠిన చర్యలు

◆ చురుగ్గా నాడు - నేడు, ఇళ్ల నిర్మాణ పనులు

◆ అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

భూముల రీ సర్వేలో తలెత్తిన ప్రతి లోపాన్నీ సరిచేస్తామని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. రీ సర్వేలో జరిగిన లోపాలపై రైతులు ఎటువంటి ఆందోళనా చెందాల్సిన అవసరం లేదన్నారు. జరిగిన పొరపాట్లను తెలియజేస్తే వాటిని సరిదిద్ది పక్కా శాశ్వత పట్టా ఇవ్వనున్నామన్నారు. సోమవారం తన ఛాంబర్‌లో తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2023 డిసెంబరు నాటికి జిల్లాలోని 737 రెవెన్యూ గ్రామాల భూముల రీ సర్వే పూర్తిచేయనున్నామన్నారు. తొలి దశలో 143 గ్రామాల్లో చేపట్టిన భూముల రీ సర్వేలో 137 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. మరో 151 గ్రామాల్లో రీ సర్వే జరుగుతోందన్నారు. రీ సర్వేలో పొరపాట్లు దొర్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అనకాపల్లిలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కో గ్రామంలోని భూముల రీ సర్వేకు 90 నుంచి వంద రోజుల వరకు పడుతుండటంతో పొరపాట్లకు అవకాశముండదని విలేకరుల ప్రశ్నకు బదులిచ్చారు. రీ సర్వేలో రైతుల నుంచి ప్రతి అభ్యంతరాన్నీ స్వీకరించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. నాడు-నేడు మిగతా 2లో..



మాట్లాడుతున్న కలెక్టర రవి పట్టాన్‌శెట్టి

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

▶ వార్త 2లో..

పంటల మద్దతు ధర చట్టం కోసం వినతి

▶ వార్త 2లో..

బొగ్గు బ్లాకుల వేలం తగదు

▶ వార్త 2లో..

ఎన్నో అనుమానాలు ?

డ్రమ్ములో మహిళ అస్థిపంజరంపై సర్వత్రా చర్చ



ప్రజాశక్తి - మధురవాడ : వికలాంగుల కాలనీలోని ఓ అద్దె ఇంట్లో ప్లాస్టిక్ డ్రమ్ములో ఆదివారం బయటపడిన మహిళ అస్తిపంజరంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఇది హత్యేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని నెలలుగా వాటర్ డ్రమ్ములో ఈ అస్తి పంజరం ముక్కలు, ముక్కలుగా ఉన్న విషయాన్ని చూసి గతంలో అద్దెకు ఉన్న వ్యక్తిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క కుళ్లిపోయిన స్థితిలో బయటపడిన మహిళ అస్థిపంజరం విషయం మధురవాడ, పిఎం.పాలెం ప్రాంతాల్లో కలకలం రేపింది. మహిళను హత్య చేసి డ్రమ్ములో ఉంచినట్లు భావిస్తున్నారు. డ్రమ్ము చుట్టూ ప్లాస్టిక్ సీల్ వేయడం వల్ల దుర్వాసన రాలేదని పలువురు చెబుతున్నారు. ఆ ఇంట్లో అద్దెకు ఉంటున్న రుషి ఎక్కడ ఉన్నాడు ? అన్న సందేహాలు వ్యక్తమవు తున్నాయి. పోలీసులు అతని గురించి అన్వేషి స్తున్నారు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారిస్తే చాలా విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంటుందంటున్నారు. భార్యతో కలిసి సొంత ఊరు వెళ్ళిపోయిన అతను తిరిగి సంవత్సరం తర్వాత ఇక్కడికి వచ్చి రెండు రోజులు మాత్రమే ఉండి వెళ్లిపోవడంపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొద్ది నెలలుగా ఆ ఇంట్లో లైట్లు వెలుగుతూ, ఫ్యాన్లు తిరుగుతూ ఉండటంతో.. ఆ ఇంట్లో ఏదో జరిగి ఉంటుందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎవరినైనా మహిళను బయట హత్య చేసి మృతదేహాన్ని మాయం మిగతా 2లో..

సర్దుబాటుతో అన్యాయం చేయొద్దు

విశాఖ, అనకాపల్లి డిఇఒ కార్యాలయాల ఎదుట యుటిఎఫ్ ధర్నాలు



విశాఖలో ధర్నా చేపట్టిన యుటిఎఫ్ నాయకులు

సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులకు అన్యాయం చేయొద్దని యుటిఎఫ్ విశాఖ, అనకాపల్లి జిల్లా కమిటీలు పేర్కొన్నాయి. ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ సోమవారం ఆయా జిల్లాల డిఇఒ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టాయి.

కలెక్టరేట్ (విశాఖపట్నం) : ప్రమోషన్ల కోసం ఆప్షన్ తీసుకున్న టీచర్లకు ప్లేస్‌లు చూపకుండా పని సర్దుబాట్లు ద్వారా ప్లేసుల భర్తీ చేయడాన్ని నిరసిస్తూ యుటిఎఫ్ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.అప్పారావు మాట్లాడుతూ ఇటీవల టీచర్ల ప్రమోషన్ల నిమిత్తం సీనియారిటీ, సర్వీస్ సర్టిఫికెట్లు పరిశీలించి వారి ఆమోదంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ఆప్షన్లు తీసుకున్నారని చెప్పారు. బదిలీల సమయంలో ప్లేసులు ఇస్తామన్నారని తెలిపారు. అయితే నేడు బదిలీల ప్రస్తావన లేకుండా సబ్జెక్టు టీచర్ల కొరత చూపించి, పని సర్దుబాటు పేరుతో ప్రమోషన్ పొందిన వారికి అన్యాయం చేశారని మండిపడ్డారు. తక్షణం ప్రభుత్వం స్పందించాలన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం సమర్పించారు.

అనకాపల్లి : ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు పోస్టింగులు ఇవ్వాలని, తక్షణమే బదిలీలు నిర్వహించాలని కోరుతూ సోమవారం మిగతా 2లో..



అనకాపల్లిలో నినదిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

మొదటి పేజీ తరువాయి..

ఈ గాలీ, నేలా కాలుష్యం..!

అమల్లో ఉన్నట్లు లెక్క. అలాంటిది ఆ దశను దాటిపోయింది. విశాఖ పోర్టు, హెచ్‌పిసిఎల్, ఫార్మా కంపెనీల వ్యర్థాల ప్రభావం ప్రధానంగా నగరంలో ఎయిర్ క్వాలిటీ దెబ్బతినడానికి కారణంగా ఉన్నాయి.

కాలుష్య నియంత్రణపై మండలికి దృష్టిలేదు

కాలుష్య నియంత్రణ చర్యలపై కంట్రోల్ బోర్డు అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విశాఖకు చెందిన పర్యావరణ కార్యకర్త పివి.రమణ 'ప్రజాశక్తి'కి తెలిపారు. కేవలం ఫైన్‌లు వేసి కాలుష్యంపై నోరుమెదపడం లేదన్నారు. ఉదాహరణకు పోర్టులో కవర్డ్ స్టోరేజీ సిస్టం, ఎత్తయిన గోడలు నిర్మించినప్పటికీ గాలిలో కాలుష్య ధూళి రేణువుల వేగం అధికంగా ఉండడంతో నగరమంతటా కార్బన్‌డయాక్సైడ్ వ్యాప్తి చెందుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు సాగర్‌మాల కూడా రాబోతుందని, దీంతో మరింత కాలుష్యం పెరగనుందని, విశాఖ మరో భోపాల్ మాదిరిగా మారకుండా ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టాలని తెలిపారు.

వైద్యులేమంటున్నారు ?

శ్వాస కోశ సంబంధిత సమస్యలతో బాధపడుతూ వైద్యుల వద్దకు వెళు్తన్నవారి సంఖ్యలో గతం కంటే 30 శాతం పెరిగిందని నగరానికి చెందిన ఓ ప్రముఖ వైద్యుడు 'ప్రజాశక్తి' ఎదుట వెల్లడించారు. శ్వాస పీల్చడంలో ఇబ్బందులకు గురయ్యే వారూ నానాటికీ పెరుగుతున్నట్లు చెప్పారు. దీంతో నగరమంతటా ఈ సమస్య ఉందన్నది తెలుస్తోంది. పరిశ్రమలకు సంబంధించిన కాలుష్యం అంతా ఇంతా కాదు. హెచ్‌పిసిఎల్ రాత్రివేళల్లో వదిలే ఉద్గారాల కారణంగానూ, ఫార్మా కంపెనీల కాలుష్యం వల్లనూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగరం మీదకు ఈ కాలుష్యం 'గాలి వాటం' బట్టి చేరుతోంది. నగరంలో ఎత్తయిన యారాడ, సింహాచలం కొండలు ఉండడంతో బయటకు వెళ్లకుండా కొండలపైనున్న చెట్లపైనే ఇలా వచ్చిన కాలుష్యం ఉండిపోతోందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. వీచే గాలిని బట్టి కాలుష్య రేణువులు నగరంలో విస్తరించడంతో గాలిలో నాణ్యత దెబ్బతినడంతో ప్రజలపై ప్రభావం చూపుతోంది. గాలి కాలుష్యాన్ని నియంత్రించలేకపోతే నగర జీవి జీవనం దినదినగండం అవుతుందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

సర్దుబాటుతో అన్యాయం చేయొద్దు

జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ విద్యా శాఖలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో ఉపాధ్యాయులను సుదూర ప్రాంతాలకు వేయడం, బదిలీలు నిర్వహించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని, ఉపాధ్యాయలోకాన్ని తీవ్ర గందరగోళానికి గురి చేస్తోందన్నారు. ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు ఇవ్వడానికి అంగీకారం తెలిపి ఇవ్వకుండా వేధించడం సరికాదన్నారు. జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రతి నెలా ఐదో తేదీ దాటుతున్నా జీతాలు ఇవ్వకపోవడం ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి జోగా రాజేష్, ఆడిట్ కన్వీనర్ పి.వెంకటరావు, మండల నాయకులు ఎస్.నూకరాజు, శ్రీకాంత్, కామరాజు, దేవుళ్లు నాయుడు, రవి పాల్గొన్నారు.

ఎన్నో అనుమానాలు ?

చేసే క్రమంలో ఆ ఇంటికి తెచ్చి.. దానికి ప్లాస్టిక్ సీల్ చేసి వాటర్ డ్రమ్ములో పెట్టి ఉంచారా ? అన్న కోణంలోనూ పోలీసులు ఆలోచిస్తున్నారు. పోలీసులు ఇప్పటికే ఇంటి యజమానిని పలుమార్లు విచారించారు.

ప్రతి లోపాన్నీ సరిచేస్తాం

కింద పాఠశాలల పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.

సొంత స్థలమున్నవారు, లేదంటే ప్రభుత్వం మంజూరు చేసిన పట్టా వున్నవారు ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. ఇళ్లు, ఇంటి స్థలం కోసం డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్ల కోసం ఎవరికీ ఒక్క పైసా కూడా ఇవ్వొద్దని తెలిపారు. జిల్లాలో మంజూరైన 18,275 ఇళ్లలో ఇప్పటివరకు 2,904 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. డిసెంబరుకు 3,982, వచ్చే జనవరి నాటికి 2,846 ఇళ్ల నిర్మాణాలు పూర్తికానున్నాయన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు డిసెంబరు చివరి నాటికి ప్రారంభించేలా ప్రయత్నిస్తున్నామన్నారు.తహశీల్దార్ కార్యాలయాలన్నీ మరో నెలలో ఈ - ఆఫీసులు కానున్నాయన్నారు. తద్వారా సేవలు మరింత సులభతరం కానున్నాయన్నారు. సరైన డాక్యుమెంట్లు వున్న భూములు, స్థలాలను 22ఎ జాబితా నుంచి తొలగిస్తున్నామన్నారు. స్పందనలో వచ్చిన వినతులపై ఎప్పటికప్పుడు సమీక్షించి ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థ భూ అక్రమణపై సీనియర్ రెవెన్యూ అధికారితో విచారణ జరపనున్నట్లు తెలియజేశారు.

పంటల మద్దతు ధర చట్టం కోసం వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేంద్రం పంటల మద్దతు ధర చట్టం చేసేలా ఒత్తిడి తేవాలని విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ కార్యాలయంలో రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. రైతు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతాంగం పోరాటం చేపట్టినప్పుడు లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను కేంద్రం అమలు జరపాలన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని, సోమనాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్కరణల చట్టం సవరణ ఆపాలన్నారు. పై విషయాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎంపీ ఎంవివి.సత్యనారాయణను కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం విజయనగరం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, అనకాపల్లి జిల్లా కోశాధికారి గండి నాయన బాబు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధుల ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు బకాయి ఉన్న నాలుగు నెలల జీతాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధుల ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు మీడియాతో మాట్లాడుతూ కృష్ణా కనస్ట్రక్షన్ కాంట్రాక్టర్ నుంచి ఆగష్టు, సెప్టెంబరు, అక్టోబర్, నవంబరు నెలల జీతాలు బకాయి పడ్డాయన్నారు. పలుసార్లు విన్నవించినా కాంట్రాక్టర్ స్పందించలేదన్నారు. కలెక్టర్ స్పందించి బకాయి జీతాలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కనీస వేతనం చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కాంట్రాక్టరు నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమవారం నుంచి సమ్మెకు దిగుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు పి.పోతురాజు, కార్యదర్శి వి.కేశవ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఆసుపత్రి శానిటేషన్ వర్కర్లు

'పొరుగు సేవ' నోటిఫికేషన్ రద్దు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి ప్రజారోగ్య విభాగంలో పొరుగు సేవ పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బందిలో ఏర్పడిన 482 ఖాళీలను ఆప్కాస్ ద్వారా భర్తీ చేయడానికి ఇచ్చిన నోటిఫికేషన్‌ను తక్షణం రద్దు చేయాలని జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్ స్పందనలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జివిఎంసిలో 60 ఏళ్లు నిండిన, అనారోగ్యంతో చనిపోయిన వారి స్థానంలో దరఖాస్తు చేసుకున్న వారి కుటుంబ సభ్యులకు ఆప్కాస్ ద్వారా ఉద్యోగాలు కల్పించాలన్నారు. జివిఎంసి ప్రజారోగ్య విభాగంలో 2020 ఏప్రిల్‌లో 140, ఆగస్టులో 160 పోస్టులకుగాను ఉద్యోగ నియామకాలు చేశారన్నారు. అయితే వీరందరినీ ఆప్కాస్‌లో కలపలేదని, జీతాలు కూడా ఇవ్వలేదని అన్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు నెలలో 482 ఖాళీలను భర్తీ చేయడం కోసం నోటిఫికేషన్ ఇచ్చారని చెప్పారు. 20 ఏళ్లకు పైగా పనిచేస్తున్న కార్మికుల కుటుంబాలను విస్మరించడం సరికాదన్నారు. క్లాప్ వాహనాల ద్వారా ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరణ చేసేందుకుగాను అదనంగా రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఊరుకూటి రాజు పాల్గొన్నారు.

ఆశా వర్కర్స్ యూనియన్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 12, 13 తేదీలలో విజయనగరంలో జరుగనున్న ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సోమవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.పద్మ, వి.మేరీ మీడియాతో మాట్లాడుతూ మహాసభలు ప్రారంభం రోజైన 12న ఉదయం విజయనగరం రైల్వే స్టేషన్ నుంచి ఆశా కార్మికులు భారీ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ ఉంటాయన్నారు. శాసనమండలి సభ్యులు కెఎస్.లక్ష్మణరావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోసమ్మ, కె.ధనలక్ష్మి ముఖ్య అతిథిలుగా పాల్గొంటారన్నారు. పెద్ద ఎత్తున ఆశా కార్యకర్తలు ఈ బహిరంగ సభకు తరలి రావాలని కోరారు. ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పని భారాన్ని తగ్గించాలని, వేధింపులు ఆపాలని, ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సీతారత్నం, లీలావతి, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కార్యదర్శి బి.జగన్ పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలం తగదు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బొగ్గు మంత్రిత్వ శాఖ తెలంగాణలోని నాలుగు బొగ్గు బ్లాకులను వేలానికి పెట్టిన సందర్భంగా పలు అభ్యంతరాలు తెలియజేస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్‌కు, కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి ఎఎల్.మీనాకు భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్.శర్మ సోమవారం లేఖ రాశారు. పెనగడ బ్లాక్ రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ కింద నోటిఫై చేయబడిన ప్రాంతంలో.. పీసా చట్టంలోని నిబంధనలు వర్తించే ప్రాంతంలో ఉందని, మిగిలిన మూడు బ్లాక్‌లు ఉన్న ప్రాంతాలు కూడా రాష్ట్రంలోని నోటిఫైడ్ షెడ్యూల్డ్ ఏరియాల్లోనే ఉండే అవకాశం ఉందని, ఆయా విషయాలను ధ్రువీకరించాలని కోరారు. అటవీ హక్కుల చట్టాన్ని విస్మరించి ఏ పనీ చేయొద్దన్నారు.

భూదందాలపై సిబిఐ దర్యాప్తు జరపాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నంలో వైసిపి నాయకుల భూదందాలపై సిబిఐ విచారణ జరిపించాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఢిల్లీలో రాష్ట్రపతి, ప్రధాని, హోంమంత్రి కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. ఇదే సందర్భంలో కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లి ఓ లేఖను ఇచ్చారు.

వయోపరిమితి పెంచాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల వయో పరిమితి పెంచాలని డివైఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఏటా పోలీసు శాఖలో పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పి మూడు సంవత్సరాల తర్వాత పోలీసు శాఖలో ఖాళీలతో సంబంధం లేకుండా, నిరుద్యోగుల సంఖ్యతో పొంతన లేకుండా నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమన్నారు.

జలకళ ఏదీ?

ఏడాది కిందట బోర్లు వేసినా బిగించని మోటార్లు

ప్రజాశక్తి-ఆనందపురం : సాగునీరు అందించాలనే సంకల్పంతో చేపట్టిన జలకళ పథకం రైతులకు ప్రయోజనం చేకూర్చడంలేదు. నేటికీ బోరు నుంచి నీరు బయటికి రాని పరిస్థితి ఉంది. మండలంలోని 83 మంది రైతులను జలకళ పథకం కింద అర్హులుగా గుర్తించారు. ఏడాది కిందటే 27 బోర్లు వేసి పైపులు అమర్చారు. విద్యుత్ లైన్ కూడా వేశారు. కానీ బోరులో మోటార్ వేయకుండా వదిలేశారు.

బోర్లు వేస్తే వ్యవసాయం బాగా పండిందామని ఆనందంతో ఉన్న రైతులకు ఏడాదైనా మోటార్లు అమర్చకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. కణమాం పంచాయతీలో సుమారు 11 మంది రైతులకు జలకళ పథకం ద్వారా బోర్లు వేశారు. వీటికి మోటార్లు బిగించి వినియోగంలోకి తీసుకురావాలని కణమాం రైతులు కోరుతున్నారు.


కణమాంలో వేసిన బోరు



వేసిన విద్యుత్ కనెక్షన్

టెండర్లు పిలిచాం

మండలంలో 83 బోర్లు జలకళ పథకం కింద మంజూరయ్యాయి. 27 బోర్లు వేశాం. మిగిలిన బోర్లు, మోటార్లకు టెండర్లను పిలిచాం. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే మోటార్లు బిగించి వినియోగంలోకి తీసుకొస్తాం.

ఆంజనేయులు
ఎడిఎ

నేరాలు ఘోరాలు

స్క్రాప్ దుకాణ యజమాని మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని లోడగలవానిపాలెం వద్ద స్క్రాప్ దుకాణం నిర్వహిస్తున్న ఉప్పాడ ధర్మరాజురెడ్డి (41) మృతిచెందారు. ధర్మరాజురెడ్డి ఆదివారం రాత్రి తన షాపులో పనిచేస్తున్న మహిళ ఎసమ్మ ఇంటి వద్ద మద్యం తాగి, నాన్ వెజ్ తో భోజనం చేసి అక్కడే పడుకున్నాడు. తెల్లవారుజామున చూసేసరికి ధర్మరాజురెడ్డి మృతి చెంది ఉన్నాడు. ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు ఎసమ్మ అందించారు. మృతుని భార్య హేమలత పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుండెపోటుతో మరణించారా? మరే ఇతర కారణాలు ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతునికి తల్లి జిమ్మమ్మ, భార్య హేమలత, కుమారుడు భూపతి, కుమార్తె జీవిత ఉన్నారు. సిఐ రామచంద్రరావు ఆధ్వర్యాన ఎస్ఐ శ్యామ్‌సుందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అథ్లెటిక్స్‌లో బంగారు పతకాలు

ప్రజాశక్తి- పిఎం పాలెం : జెఎన్‌టియు కాకినాడ విశ్వవిద్యాలయంలో ఈ నెల 2, 3 తేదీలలో నిర్వహించిన అంతర కళాశాల అథ్లెటిక్ పోటీలలో కొమ్మాది చైతన్య కళాశాల బి.టెక్ మెకానికల్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి చెల్ల సురేష్ రెండు బంగారు పతకాలు సాధించాడు. 5, 15 కిలో మీటర్లు పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నెల 1వ తేదీన జెఎన్‌టియు విజయనగరం విశ్వ విద్యాలయంలో నిర్వహించిన చదరంగం పోటీలలో బి.టెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థి జె.నిఖిలేష్‌రెడ్డి ప్రథమ స్థానం సాధించి ఫిబ్రవరి నెలలో జరిగే అంతర్ విశ్వ విద్యాలయ పోటీలలో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులను చైతన్య కళాశాల ఫైనాన్స్ డైరెక్టర్ పి.మాధవి, ప్రిన్సిపల్ కె.సురేష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పార్వతి, పీడీ పి.వేణుగోపాల్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.


విద్యార్థులకు ట్రై సైకిళ్లు అందిస్తున్న మహేష్

వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి- ఆనందపురం : వికలాంగ విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగపరచుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందించారు. కొందరికి వీల్ చైర్లు పంపిణీ చేశారు. మండల విద్యాశాఖాధికారి ఎస్ఎస్.పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైసిపి నాయకులు మజ్జి వెంకటరావు, పాండ్రంకి శ్రీను, బిఆర్‌బి నాయుడు, బొట్ట రామకృష్ణ, లంక రాంబాబు, అప్పలస్వామి నాయుడు, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, నాగమణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మిస్ టీన్ సూపర్ గ్లోబ్ విజేత నందనకు అభినందన

ప్రజాశక్తి - ఆరిలోవ : అంతర్జాతీయ అందాల పోటీల్లో మిస్ టీన్ సూపర్ గ్లోబ్ 2022 విజేతగా నిలిచి భారతదేశానికి కిరీటాన్ని తీసుకొచ్చిన విశాఖ వ్యాలీ స్కూలులో పదో తరగతి చదువుతున్న బాలిక తేజు నందనను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సోమవారం అభినందించారు. వివిధ దేశాల నుంచి 40 మంది పాల్గొనగా తేజు నందన మూడవ విన్నర్ టైటిల్ సొంతం చేసుకున్నారు. పెదగదిలిలోని క్యాంపు కార్యాలయంలో తేజు నందన మేయర్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా తేజు నందనను మేయర్ సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బోని శ్రీనివాసరావు, కోడిబోయిన బంగార్రాజు, తేజు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ల్యాండ్ సర్వే సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 'ల్యాండ్ సర్వే' సర్టిఫికెట్ కోర్సు చేయుటకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీస అర్హత 10వ తరగతి పాసైనా, ఫెయిల్ అయినా సంబంధిత కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. ఇందునిమిత్తం రూ.6 వేలు ఫీజు చెల్లించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 12 వ తేదీలోపు కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ముగిసిన అన్నదానం

ప్రజాశక్తి - ఆరిలోవ : 9వ వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో గల భక్తతుకారం రామాలయం ప్రాంగణంలో శ్రీరామ అయ్యప్ప అన్నదానం ట్రస్టు ఆధ్వర్యాన 41 రోజుల పాటు నిర్వహించిన నిత్య అన్నదానం కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆర్థికసాయం అందజేసిన సుందరరావు స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనకు శ్రీరామ అయ్యప్ప అన్నదానం ట్రస్టు సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు సోమేష్, శ్యామసుందర్, గోపి వెంకట రమణ, వాసు పాల్గొన్నారు.


జిల్లా కలెక్టర్ మల్లికార్జున ద్వారా అవార్డు అందుకుంటున్న డాక్టర్ శైలజ

ఉత్తమ వైద్యాధికారిగా శైలజ

ప్రజాశక్తి -ఆనందపురం : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.శైలజకు జిల్లా ఉత్తమ వైద్యాధికారి అవార్డును జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అందజేశారు. శైలజను డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి అభినందించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, సూపర్‌వైజర్ గోవిందరావు, మిత్రులు శ్రేయోభిలాషులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

'చిట్టివలస' భూముల అమ్మకం చెల్లదు


కలెక్టర్ కార్యాలయానికి వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన జ్యూట్ మిల్లు కార్మికులు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యం భూములను అమ్మే ప్రయత్నం చేయడం చట్ట రీత్యా చెల్లదని చిట్టివలస జ్యూట్ మిల్లు లాకౌట్ బాధిత సంఘం కార్యవర్గ సభ్యులు ఎన్.అప్పలరాజు, వివిఎ.నరసింహరాజు, సింగిడి అప్పారావు, జీరు వెంకటరమణ, పాసల శివ తెలిపారు. ఇదే అంశంపై జిల్లా కలెక్టర్, జాయింట్ లేబర్ కమిషనర్‌కు సోమవారం వినతి పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. పలు అంశాలపై ఇప్పటికే తమ సంఘం జ్యూట్ యాజమాన్యంపై కోర్టులో కేసులు వేసినట్లు తెలిపారు. విచారణలో ఉంటుండగానే యాజమాన్యం భూములను అమ్మే ప్రయత్నం చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఇప్పటికే కొన్ని భూములను యాజమాన్యం అమ్మకానికి పెట్టినట్లు తమ సంఘం దృష్టికి వచ్చిందని తెలిపారు. యాజమాన్యం దుందుడుకు చర్యలను అడ్డుకోవాలని వినతి పత్రంలో కోరారు.

9వ వార్డులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధి టిడిపి ఆధ్వర్యాన హనుమంతవాక కొండవాలు ప్రాంతం నుంచి విజయ దుర్గకాలనీ, క్రాంతినగర్, సంజయ్‌గాంధీ కాలనీలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. స్థానికులతో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడి సమస్యలనడిగి తెలుసుకున్నారు. సింహాచలం భూ సమస్య, వెలగని దీపాలు, విచ్చలవిడిగా గంజాయి వాడకం, పెరిగిన నిత్యావసర ధరలు, విద్యుత్ బిల్లల మోత తదితర సమస్యలపై ప్రజలు తమ గోడును వెలబుచ్చుకున్నారు. వీధి దీపాలు, శానిటరీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులతో మాట్లాడారు. సంజయ్‌గాంధీ కాలనీ చెందిన పలువురు వైసిపి కార్యకర్తలు ఎమ్మెల్యే వెలగపూడి సమక్షంలో టిడిపిలో చేరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి ఇన్‌ఛార్జి బుడుమూరు గోవిందు, అధ్యక్షులు అక్కరమాని రాంబాబు, గెడ్డవలస వెంకటరావు, 12వ వార్డు ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు, బాదరు బాలరాజు, గాడి సత్యం, ముగడ రాజారావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యపై వినతి

ప్రజాశక్తి -పిఎం పాలెం : రైతు బజార్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ జివిఎంసి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాముకు సిఐటియు మధురవాడ జోన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. 5వ వార్డు పరిధిలోని రైతుబజార్‌కు వెళ్లే రహదారిలో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని వివరించారు. వాహనాలు రైతు బజార్ లోపలకు వెళ్లేందుకు కాలువపై కాంక్రీట్ పలకలు అమర్చి రోడ్డును విస్తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి అధికారులు పరిశీలన

మధురవాడ : కొమ్మాది రైతు బజారు వద్ద నిత్యం పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించడానికి సిఐటియు నాయకులతో కలిసి జివిఎంసి ఇఇ మత్యరాజు సోమవారం పరిశీలించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి రహదారి అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఇఇ తెలిపారు. స్వయంకృషి నగర్‌లో ఆక్రమణలో ఉన్న 12 అడుగుల సిసి రహదారి స్థలాన్ని స్వాధీనం చేసుకుని పూర్తి చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులతోపాటు స్థానికులు టికె.శారద, ఎస్.ప్రసాద్, ఎన్.రామప్పడు, కె.కొండమ్మ పాల్గొన్నారు.


కాలువను పరిశీలిస్తున్న అధికారులు, సిఐటియు నాయకులు

గీతం ప్రగతిలో పూర్వవిద్యార్థుల భాగస్వామ్యం

ప్రజాశక్తి- మధురవాడ : గీతం విశ్వవిద్యాలయాన్ని 2040 నాటికి ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని చేరడానికి పూర్వవిద్యార్థులను సహితం భాగస్వాములను చేస్తామని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం తెలిపారు. ఈ నెల 17వ తేదీన "హోమ్ కమింగ్" పేరిట నిర్వహిస్తున్న గీతం పూర్వవిద్యార్థుల సమావేశ వివరాలను సోమవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. పూర్వవిద్యార్థుల సహాయంతో ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శక కార్యక్రమాల నిర్వహణతో పాటు గీతం వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ (విడిసి) ద్వారా స్టార్టప్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఏడాదిలో జీవశాస్త్ర స్టార్టప్ ప్రోత్సాహకానికి "బయోనెస్ట్" ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. గీతం పూర్వవిద్యార్థి సంబంధాల విభాగం డైరెక్టర్ నవీన్ మాట్లాడుతూ, పూర్వ విద్యార్థుల పిల్లలలో 1150 మందికి గీతం స్కాలర్‌షిప్ అందించామని, ప్రస్తుత విద్యార్థులకు ప్రాంగణ నియామకాలకు పూర్వవిద్యార్థులు సహకరిస్తున్నారని తెలిపారు. విదేశాలలో ఉన్న విద్యార్థులు ఏటా తమ భారతదేశపు ప్రయాణంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొనడం అలవాటుగా చేసుకునేందుకు వీలుగా ఏటా డిసెంబర్ 17వ తేదీన "హోమ్ కమింగ్" కార్యక్రమం తప్పకుండా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో గీతం బిసిజిసి సహాయ డీన్ గురుమూర్తి గంగాధరన్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ అమిత్రమిత్ర, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ విజయ శేఖర్, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్, గీతం దంత కళాశాల సహాయ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న గీతం ప్రతినిధులు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఈ నెల 9, 10 తేదీలలో నిర్వహించే స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఎల్ఎంఎం పార్కులో యూనియన్ అధ్యక్షులు జె.అయోధ్యరామ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడటంలో సిఐటియు ముందంజలో ఉందన్నారు. యూనియన్ ఏర్పడి 40 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఏర్పాటుచేసిన మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల సంక్షేమం. పరిరక్షణ కోసం సిఐటియు అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. సిఐటియుకు అండగా ఉన్న కార్మికులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వైటి.దాస్, బి.మధు, బి.అప్పారావు, రామస్వామి, కె.సత్యనారాయణ, జి.గంగాధర్, నీలకంఠరావు, కెవి.సత్యనారాయణ, దేవుడునాయుడు, మొహిద్దిన్, దానయ్య తదితరులు పాల్గొన్నారు.


స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డికి వినతి ఇస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు అనుమతివ్వాలని వినతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ టౌన్ షిప్‌లోని పార్కుల్లో ఓపెన్ జిమ్ములు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సిఎమ్‌డికి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు సోమవారం వినతిపత్రం అందించారు. డాక్టర్ గంగారావు విజ్ఞప్తి మేరకు స్టీల్‌ప్లాంట్ టౌన్ షిప్‌లోని 8 సెక్టార్లలో ఉన్న పార్కుల్లో ఓపెన్ జిమ్ములు ఏర్పాటుకు జివిఎంసి నిధులు మంజూరు చేసింది. రూ.40 లక్షల విలువైన పరికరాల ఏర్పాటుకు 3నెలల క్రితమే నిర్ణయం జరిగినా కొన్ని అడ్డంకులు వల్ల ఏర్పాటుకాకపోవడంతో ప్లాంట్ సిఎమ్‌డిని గంగారావు కలిశారు. తక్షణం ఓపెన్ జిమ్ములు ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. సిఎమ్‌డిని కలిసిన వారిలో గంగారావుతోపాటు స్టీల్ సిఐటియు నాయకులు జె.అయోధ్యరాం, యు.రామస్వామి ఉన్నారు.

ఓటు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి -గాజువాక : టిఎస్ఆర్, టిబికె కళాశాలలో ఓటు నమోదుపై సోమవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విఎంఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్, ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి డి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఓటు వజ్రాయుధం అని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. కరస్పాండెంట్ ఉమామహేశ్వర మాట్లాడుతూ, ఓటు యొక్క విశిష్టతను, ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో గాజువాక తహశీల్దార్ సుజాత, డిప్యూటీ తహశీల్దార్ శ్యాం కుమార్ పాల్గొన్నారు.

శ్మశాన వాటిక సరిహద్దులు నిర్ణయం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి పురుషోత్తపురం శ్మశాన వాటికకు జీవీఎంసీ డిఇ రాజు, సర్వే విభాగం అధికారులు, సచివాలయ సిబ్బంది సరిహద్దులు నిర్ణయించి ప్రహరీ నిర్మాణ పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు చందు యాదవ్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదేశాలు మేరకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో గుడి, హాస్పిటల్ అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే సహకారంతో చేశామని తెలిపారు. ఏదైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు.

బిసిల సమస్యలపై టిడిపి వినతులు

ప్రజాశక్తి-యంత్రాంగం

బిసిల సమస్యలపై టిడిపి ఆధ్వర్యాన సోమవారం తహశీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందించారు.

భీమునిపట్నం : బిసిల సబ్ ప్లాన్ నిధులను దారి మళ్ళించవద్దని, వారి సంక్షేమానికి కేటాయించాలని కోరుతూ జివిఎంసి 1, 2, 3, 4 వార్డుల టిడిపి నాయకులు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనుబాబుకు వినతి పత్రం అందజేశారు. బిసి కార్పొరేషన్ ద్వారా చేతి వృత్తులకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, 1, 4 వార్డుల అధ్యక్షులు టి.సూరిబాబు, పాసి నరసింగరావు, నాయకులు కనకల అప్పలనాయుడు, మద్దిల సుబ్బారావు, పైడిపల్లి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

పిఎం పాలెం : బిసిలు ఎదుర్కొంటున్న సమస్యలపై 6వ వార్డు టిడిపి ఆధ్వర్యాన వినతి పత్రం తహశీల్దార్ కార్యాలయంలో అందజేశారు. రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు మూడున్నర సంవత్సరాల నుండి తీవ్రమైన అన్యాయం జరుగుతుందని వినతిలో పేర్కొన్నారు. జీవో 217ను రద్దుచేయాలని, బీసీలకు చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటుకు అందించే రాయితీలను పునరుద్ధరించాలని, బీసీ స్టడీ సర్కిళ్లకు పూర్వ వైభవం కల్పించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆరో వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, బిసి సెల్ ఉపాధ్యక్షుడు గొల్లంగి ఆనందబాబు, జిల్లా తెలుగు యువత కార్యదర్శి గరే గురునాథ్, వార్డు బిసి సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


భీమిలిలో డీటీకి వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

కంచరపాలెం : బీసీ సబ్ ప్లాన్ నిధుల మళ్లింపు ఆపాలని, జీవో 217ను వెంటనే రద్దు చెయ్యాలని డిమాండ్‌చేస్తూ గోపాలపట్నం తహశీల్దార్‌కు పశ్చిమ నియోజకవర్గం బీసీ సెల్ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పొలిమేర సీతారాం, పెంటకోట అజయ్‌బాబు, రాజమండ్రి నారాయణ, బుద్ద త్రినాధ్, మళ్ల శంకరరావు, నరవ పైడిరాజు, తమ్మిన విజయకుమార్, మధు అన్నురి, గోపి, నాగరాజు, కాండ్రేగుల వెంకటరావు, ధర్మారావు, మహిళా నాయకులు నరవ అనూష, మదన్, సంతోష్ పాల్గొన్నారు.

మట్టి పరిరక్షణపై ర్యాలీ

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రపంచ మట్టి దినోత్సవం సందర్భంగా ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యాన సోమవారం మద్దిలపాలెం నుంచి గురుద్వారా వరకు మట్టి పరిరక్షణపై ర్యాలీ నిర్వహించారు. మట్టిని పరిరక్షిద్దాం భావితరాలను కాపాడదాం అంటూ కాలేజీ విద్యార్థులు, పలు ఎన్జీవో సంఘాల వాలంటీర్లు ప్లకార్డులతో ర్యాలీ చేస్తూ నినదించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వాలంటీర్ విటల్ మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయ భూములు క్షీణిస్తున్నాయన్నారు. వ్యవసాయ భూముల్లో కనీసం 3 నుంచి 6 శాతం సేంద్రియ పదార్థం ఉండేలా చట్టాలు రూపొందించాలని సద్గురు 30 వేల కిలోమీటర్ల బైక్ ర్యాలీ నిర్వహించారని తెలిపారు. ఇది ప్రపంచవ్యాప్త పర్యావరణ ఉద్యమం అన్నారు. సైడ్ ఫర్ సాయిల్ పేరుతో చుట్టుపక్కల ప్రాంతాల్లో పర్యటిస్తూ మట్టి నాణ్యత పెంచు మార్గాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

క్రీడా మైదానం ఆధునీకీకరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానం ఆధునికీకరణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. చిప్పాడలోని దివీస్ సంస్థ ఆర్థిక సాయం రూ.10 లక్షలతో పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల, అధ్యాపకులు, విద్యార్థులు, సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్ కుమార్, ఫణీంద్ర, పైడి నాయుడు పాల్గొన్నారు.

ఇళ్లు అప్పగించాలంటూ సిపిఐ నిరసన

ప్రజాశక్తి-యంత్రాంగం

జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యాన పలుచోట్ల సోమవారం నిరసన తెలిపారు.

పెందుర్తి: టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఎప్పుడు ఇస్తారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. జివిఎంసి జోన్ -8 కార్యాలయం వద్ద సోమవారం టిడ్కో లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడుకు వినతిపత్రం సమర్పించారు. పెందుర్తి ప్రాంతంలోని టిడ్కో ఇళ్ల పరిస్థితుల గురించి ఆయనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డి టిడ్కో ఇళ్లను మరింత నాణ్యతతో నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. మూడున్నరేళ్లు అయినా నేటికీ లబ్ధిదారులకు అందించలేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లను కూడా అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. సిపిఐ ఆందోళన చేపట్టాక వాలంటీర్లను లబ్ధిదారుల ఇళ్లకు పంపించి మభ్య పెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ దొల్లతనాన్ని, మోసకారితనాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని, తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, సమితి సభ్యులు వై.రాంబాబు, పార్టీ నాయకులు రాము, రమణ, మల్లేష్, రజిని, అన్నపూర్ణ, జగన్ పాల్గొన్నారు.

పిఎం.పాలెం: జివిఎంసి మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు ఎస్‌కె.రెహమాన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో 34 లక్షలు మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో ఇప్పటికీ చాలా చోట్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదని తెలిపారు. ఇంటి నిర్మాణ ఖర్చులు బాగా పెరగడం, ప్రభుత్వం ఇస్తున్న 250 కేజీల ఉక్కు, 90 బస్తాలు సిమెంట్, ఇటుక సరిపోవని, కనీసం 1500 కేజీల ఉక్కు, 300 సిమెంట్, నాలుగు వేలు ఇటుకు అవసరం అవుతుందని తెలిపారు. నిపుణుల అంచనా ప్రకారం ఇంటి నిర్మాణానికి రూ.8 లక్షలు ఖర్చు అవుతుందని, ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.80 లక్షలు చాలక నిర్మాణాలు ప్రారంభం కాలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.5 లక్షలు ఉచితంగా సహాయం చెయ్యాలని, ఇప్పటికే పూర్తి చేసిన టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించి తక్షణమే లబ్ధిదారులకు స్వాధీనం చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వి.సత్యనారాయణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎ.దేవుడమ్మ, కె.లక్ష్మణరావు, సి.హెచ్.కాసుబాబు, ఇ.అప్పలరాజు, ఎస్‌కె.మస్తాన్‌బి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : గాజువాక జోనల్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ కార్పొరేటర్ స్టాలిన్ మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో పేదలకు టిడ్కో ఇళ్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు. ధర్నా అనంతరం గాజువాక జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

భీమునిపట్నం : వైసిపి ప్రభుత్వం ప్రారంభించిన అందరికీ ఇళ్లు పథకం కింద ఒక్కో లబ్ధిదారునికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ భీమిలి ఏరియా సమితి ఆధ్వర్యాన సోమవారం జివిఎంసి ఒకటో జోన్ కమిషనర్ ఎస్.వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఇంటి నిర్మాణ వ్యయం పెరగడం వల్ల ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు చాలదని పేర్కొన్నారు. టిడ్కో గృహాలను సత్వరమే లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఐ నాయకులు కానూరి రాంబాబు, టి.సోమరాజు, నూలు ఆదినారాయణ, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై మిడ్డేమీల్స్ కార్మికుల ఆందోళన



చోడవరంలో వినతిపత్రం ఇస్తున్న మిడ్డేమీల్స్ కార్మికులు

ప్రజాశక్తి-చోడవరం

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక ఎంఇఓ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి మాట్లాడుతూ ప్రతి నెలా 5వ తేదీ నాటికి కార్మికులకు వేతనాలు ఇవ్వాలని, బకాయి పడ్డ 12 నెలల వేతనం తక్షణమే చెల్లించాలని, కనీస వేతనాల అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బుచ్చి రాజమ్మ, అమీనా, లక్ష్మి, రాము తదితరులు పాల్గొన్నారు.



బుచ్చయ్యపేటలో ఆందోళన చేస్తున్న మిడ్డేమీల్స్ కార్మికులు

సబ్బవరం : మధ్యాహ్న భోజన వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ స్థానిక ఎంఇఒ ఎస్.అప్పలరాజుకు సిఐటియు మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి ఆధ్వర్యంలో మిడ్డేమీల్స్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో విద్యార్థులకు భోజన ఖర్చులకు రోజుకు రూ.20కు పెంచాలని, గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు ఎస్.గౌరి, దేముడమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మిడ్డేమీల్స్ కార్మికుల సమస్యలపై సోమవారం ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షులు అమర పిన్ని వరలక్ష్మి మాట్లాడుతూ కొత్త మెనూలో హాట్ పొంగలి, సాంబార్ బాత్, ఆకుకూరను తొలగించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు చేయాలని కోరారు. గుర్తింపు కార్డులు, యూనిఫారం దుస్తులు పంపిణీ చేయాలని, జీవిత బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు ఉమా కార్మికులు పాల్గొన్నారు.

కశింకోట : మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద సోమవారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు సంఘం శ్రీదేవి, సూర్య లక్ష్మి, అమ్మాజీ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : మధ్యాహ్నం భోజన పథకం కార్మికులకు కనీస వేతనాలు మధ్యాహ్న భోజనం పథకం కార్మిక సంఘం (సిఐటియు)అధ్యక్షులు కె. ప్రసన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంఇఒకు భోజన కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందించారు. మెనూలో చేసిన మార్పులకు చెల్లిస్తున్న ఛార్జీలకు పొంతన లేదని, మెనూ ఛార్జీలను రోజుకు, ఒక్కో విద్యార్థికి రూ.20కి పెంచాలన్నారు. యూనిఫాం, గుర్తింపు కార్డులు అందజేసి, ప్రమాద బీమా వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు బి. సత్యవేణి, బి. రత్నం, ఎల్. జగది, పి. రాజేశ్వరి, కె. రత్నం పాల్గొన్నారు.



కశింకోటలో...



నర్సీపట్నంలో...



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

భూములపై రైతులకు శాశ్వత హక్కులు

ప్రజాశక్తి- చోడవరం : జగనన్న శాశ్వత భూమి హక్కు పథకం ద్వారా భవిష్యత్తులో ఎటువంటి అవకతవకలు లేకుండా రైతులు శాశ్వత హక్కు కలిగి ఉంటారని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం రైతులతో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డ్రోన్ సర్వేల ద్వారా భూమిని గుర్తిస్తుందని చెప్పారు. భూమి ఉన్న రికార్డుల్లో పేరు లేకపోవడంతో అనేక మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నికృష్ణ, ఎంపీపీలు గాడి కాసు, నాగ జగదీశ్వరి, తహశీల్దార్ బి.తిరుమల బాబు, అంబేద్కర్, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పౌర సమాచార అధికారికి నోటీసులు

ప్రజాశక్తి -అనకాపల్లి : సమాచార హక్కు చట్టం ప్రకారం కోరిన సమాచారాన్ని ఇవ్వని కారణంగా కలెక్టరేట్ పౌర సమాచార అధికారికి మొదటి అప్పీలు దాఖలైన నేపథ్యంలో ఈనెల 9న ఉదయం 11 గంటలకు హాజరుకావాలని జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ పిఐఒకు నోటీసులు పంపించారు. దీనిపై కలెక్టరేట్ ఛాంబర్‌లో విచారణ జరగనుంది. సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త కాంగ్రెస్ వెంకటరమణ అడిగిన సమాచారాన్ని ఇవ్వనందుకుగాను ఈ నోటీసులు జారీ చేశారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - కె.కోటపాడు : ప్రభుత్వం గ్రామ పంచాయితీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం కల్పిస్తుందని, ఇందులో భాగంగా గ్రామస్థాయిలో జిపిడిపి ప్రణాళిక తయారీకి రూపకల్పన చేస్తుందని ఎంపిపి రెడ్డి జగన్మోహన్ అన్నారు. గ్రామపంచాయితీ అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులతో మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఎంపిపి మాట్లాడారు. ఈ ప్రణాళికలో పేదరికం లేని మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యం, సమృద్ధిగా నీటివసతి, పరిశుభ్రత, హరిత, మౌలిక సదుపాయాలు, సామాజిక భద్రత తదితర తొమ్మిది రకాల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఈర్లె అనురాధ, ఎంపిడిఓ కె.శచీదేవి, ఈవోపిఆర్డి ప్రసాద్ పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి రక్షించరూ..

ప్రజాశక్తి- సబ్బవరం

సబ్బవరం-లంకెలపాలెం రోడ్డులో నిత్యం లారీల ద్వారా రవాణా చేస్తున్న బొగ్గు, ఫ్లైయాష్ కాలుష్యం నుండి రక్షించాలని మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గి నాయుడు, ఉప సర్పంచ్ రాపర్తి అరుణ ముత్యాల నాయుడు మాట్లాడుతూ బొగ్గు, ఫ్లైయాష్ లారీల లోడులపై టార్పాలిన్లు కప్పకుండా నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ఈ వాహనాలు అతివేగం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, దసపల్లా లే అవుట్ ఎదురుగా అక్టోబర్ 29న జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన అక్కిరెడ్డి వంశీకృష్ణ మృతి చెందినట్లు తెలిపారు. తక్షణమే ఈ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, బొగ్గు, ఫ్లైయాష్ రవాణా లారీలపై టార్పాలిన్లు కప్పే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న పైడివాడ అగ్రహారం గ్రామస్తులు



యాత్రకు బయలు దేరిన మహిళలు

భక్తుల సేవలో ఎంవిఆర్ ట్రస్టు

ప్రజాశక్తి-అనకాపల్లి

బుచ్చయ్యపేట, మాడుగుల, చోడవరం మండలాలకు చెందిన భక్తులను తీర్థయాత్రలకు తీసుకెళ్లేందుకు ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) ఏర్పాటు చేసిన బస్సు సోమవారం బయలుదేరింది. ఈ బస్సును నరసింగరావుపేట ఎంవిఆర్ ట్రస్ట్ కార్యాలయం వద్ద ఎంవిఆర్ తనయుడు సంజయ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంచేందుకు తీర్థయాత్ర బస్సులను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే సుమారు 250 బస్సుల ద్వారా నెల రోజుల నుంచి వివిధ యాత్ర స్థలాలకు భక్తులను తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, ఎంవిఆర్ యువసేన ప్రతినిధులు పాల్గొన్నారు.

బిసి గర్జన పేరిట మోసం

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బీసీలకు మరోసారి ద్రోహం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో బీసీల ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చి, వారిని అణగదొక్కారన్నారు. బడ్జెట్లో బీసీలకు కేటాయించిన నిధులను ఇతర పథకాలకు మళ్లించారని, 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు ఇవ్వలేదని తెలిపారు. 2019 ఫిబ్రవరి 17న బీసీ డిక్లరేషన్ ప్రకటించిన జగన్ రెడ్డి నాలుగేళ్లలో దాని అతిగతి లేకుండా, మళ్లీ ఈ నెల 7న విజయవాడలో బీసీ గర్జన పేరుతో మరోసారి మోసం చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే బడ్జెట్లో కేటాయించిన నిధులను కార్పొరేషన్ల ద్వారా బీసీలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు కుప్పిలి జగన్మోహన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోవడం అన్యాయం

నేవీ నిర్వాసితుల ఆందోళనకు మద్దతు తెలిపిన సిపిఐ నేత బాలేపల్లి



మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ

ప్రజాశక్తి- రాంబిల్లి

నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు పరిష్కరించకపోవడం అన్యాయమని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. నేవీ గేట్ వద్ద నిర్వాసితులు చేస్తున్న ఆందోళన సోమవారం నాటికి 36వ రోజుకు చేరింది. సిపిఐ నేత బాలేపల్లి శిబిరాన్ని సందర్శించిన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేవీ సబ్ గేట్లు తెరిచి చేపల వేటకు అనుమతి ఇవ్వాలని, ఫిషింగ్ జెట్టీ నిర్మించాలని, జీవన భృతి ఇవ్వాలని తదితర డిమాండ్లతో నేవీ నిర్వాసితులు చేస్తున్న పోరాటం న్యాయబద్ధమైనదని పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం ఎనిమిది గ్రామాల ప్రజలు భూములు, నదులు వదులుకున్న నిర్వాసితులకు జీవనోపాధి కల్పించవలసిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా అధికారి యంత్రాంగంపై ఉందని స్పష్టం చేశారు. నెల రోజులపైబడి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. నేవీ నిర్వాసితుల పోరాటానికి సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. సిపిఎం మండల కార్యదర్శి జి.దేవుడునాయుడు మాట్లాడుతూ మంగళవారం ఉదయం నేవీ మెయిన్ గేట్ నుండి 8 గ్రామాల నిర్వాసితులు తహశీల్దారు కార్యాలయం వరకు మహా పాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో అన్ని పార్టీల నాయకులు, ప్రజాతంత్ర వాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దొరబాబు, నేవీ నిర్వాసితుల జెఎసి నాయకులు, నిర్వాసితులు పాల్గొన్నారు.

ఎపి వ్యకాస జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. స్థానిక దొడ్డి రామనాయుడు కార్మిక కర్షక నిలయంలో జరిగిన సంఘం 13వ జిల్లా మహాసభలో సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎం.సత్యనారాయణ, డి.వెంకన్న, ఉపాధ్యక్షులుగా కె.భవాని, యు.సత్యవతి, సహాయ కార్యదర్శులుగా కె.గోవిందరావు, ఇ.నరసింహమూర్తి, కె.లోకనాథంతో పాటు మరో 22 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ మహాసభలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతి పేద కుటుంబానికి రెండు ఎకరాల భూమి ఇవ్వాలని, పేదల సాగులో ఉన్న భూమికి పట్టాలు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పోడు, అటవీ భూములకు పట్టాలు ఇవ్వాలని, అన్యాక్రాంతమైన పేదలకు చెందిన అసైన్డ్ భూములు తిరిగి వారికి అప్పగించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్ట పరచాలని ఈ మహాసభ తీర్మానాలు చేసింది.




సత్యనారాయణ, డి.వెంకన్న



విఆర్ఓల సంఘం మండల కార్యవర్గ సభ్యులు

విఆర్ఓల సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం మండల కార్యవర్గం ఎన్నిక సోమవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగింది. సంఘం మండల అధ్యక్షులుగా ములగలేటి కృష్ణకుమార్ (రామయోగిఅగ్రహారం), ఉపాధ్యక్షులుగా బోర అప్పలరాజు (ఎ.కోడూరు), కార్యదర్శిగా పావాడ శివకృష్ణ (దాలివలస), సంయుక్త కార్యదర్శిగా బురిడి రత్నకుమారి (మర్రివలస), కోశాధికారిగా ఎం.గోవిందరావు (పింద్రంగి), కార్యవర్గ సభ్యులుగా పెచ్చేటి మధు (గొండుపాలెం), ములుగు జగదీష్ (మేడిచర్ల) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- కోటపాడు : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు పెంపుదల చేయడంపై హర్షం ప్రకటిస్తూ సోమవారం వెలుగు కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జడ్పిటిసి ఈర్లె అనురాధ ఆధ్వర్యంలో మద్యం దుకాణాల సిబ్బంది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పిటిసి మాట్లాడుతూ సూపర్వైజర్ జీతం రూ.17,500 నుండి రూ.21,500కు, సేల్స్‌మెన్‌కు రూ.15,000 నుండి రూ.18,500కు, నైట్ వాచ్‌మెన్‌కు రూ.7000 నుండి రూ.9,500కు పెంచినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైన్ షాపుల సిబ్బంది సంఘం కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల అధ్యక్షులు యడ్ల గణేష్, కింతాడ శివ, ఎక్సైజ్ కానిస్టేబుల్ ఎల్ఎస్.నాయుడు, రెండు మండలాలకు చెందిన 60 మంది సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం నిర్మించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : హైకోర్టు ఇచ్చిన సూచనల మేరకు జిల్లాకు వృద్ధాశ్రమం నిర్మించాలని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. స్థానిక గవరపాలెం వివి రమణ రైతుభారతిలో సోమవారం జరిగిన సమావేశంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కెప్టెన్ అప్పారావు మాట్లాడుతూ వయోవద్ధుల సంక్షేమ చట్టం 2007 ప్రకారం దేవాలయాలు, బస్సులు, రైళ్లలో, బ్యాంకుల్లో సీట్లు కేటాయించాలన్నారు, వృద్ధాప్య పింఛన్ పెంచాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి కృష్ణ అప్పారావు, మల్ల లోకేశ్వరరావు, రాపేటి నారాయణరావు, ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్ బొడ్డేడ అప్పారావు, బొడ్డేడ శేషు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వడ్డాది : అనారోగ్యంతో ఉన్నవారికి వైద్యం చేయడమే కాకుండా ఆపదలో ఉన్నవారికి చేయూతను అందించి శభాష్ అనిపించారు గ్రామీణ వైద్యులు. బుచ్చయ్యపేట మండలం విజయ రామరాజు పేట గ్రామానికి చెందిన రాపేటి రాజు (35) రోజువారి కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. మద్యానికి బానిసై ప్రాణాలు విడిచాడు. ఇతనికి భార్య మహాలక్ష్మి, కుమారుడు సురేష్,(17), కుమార్తె కుసుమ(10) ఉన్నారు. ప్రభుత్వం నుంచి వీరికి ఎటువంటి జీవిత బీమా దక్కలేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబానికి అదే గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు డి.అమిత్ కుమార్ ఆధ్వర్యాన సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం నుంచి రూ.10వేలు ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆర్.వాసు, డి.మూర్తి, ఆర్.ఆదినారాయణ, ఐ.కొండలరావు, నాగేశ్వరరావు, గణేష్ ,శ్రీను, సిద్ధు, నాని పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రామీణ వైద్యులు

పింఛను కోసం వృద్ధురాలి ఎదురుచూపు

- 8 నెలల క్రితం నిలిపివేత
- నేటికీ పునరుద్ధరించని వైనం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట
ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు సలాది గంగమ్మ. వయసు 85 సంవత్సరాలు పైమాటే. మండలంలోని చింతపాక గ్రామానికి చెందిన గంగమ్మ భర్త 40 ఏళ్ల క్రితమే మరణించారు. వీరి కుమారుడు, కుమార్తెకు వివాహం కావడంతో వారు వేరుగా జీవిస్తున్నారు. ప్రభుత్వ పింఛను నెలకు రూ.30 ఉన్నప్పటి నుంచి 8 నెలల క్రితం వరకు గంగమ్మ పింఛను పొందుతూ వస్తుంది. ప్రభుత్వం ఎనిమిది నెలల క్రితం ఆమె పింఛను నిలిపివేయడంతో దిక్కుతోచని స్థితిలో పింఛను కోసం ఎదురుచూస్తోంది. రెండు నెలల క్రితం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిమిత్తం గ్రామానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దృష్టికి పింఛను నిలిపివేసిన విషయాన్ని గ్రామస్తులు తీసుకెళ్లారు. స్పందించిన ధర్మశ్రీ పింఛను పునరుద్ధరించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కానీ నేటికీ పింఛను మంజూరు కాలేదు. గంగమ్మ కుమారుడు భార్య పిల్లలతో బతుకుతెరువు నిమిత్తం సామర్లకోట వెళ్లిపోయారు. కుమార్తె వివాహం కావడంతో వేరేచోట ఉంటుంది. గంగమ్మ మాత్రమే గ్రామంలో ఉంటుంది. నడవడానికి కూడా అవకాశం లేక, సరిగా వినపడక, కనబడక ఇంట్లోనే పాకుతూ మంచంపై జీవచ్ఛవంలా ఉంటుంది. ఇరుగుపొరుగు వారు ఏమైనా ఆహారం పెడితే తింటుంది. లేదంటే లేదు. ఏడు ఎనిమిది నెలలుగా పింఛను నిలిపివేయడంతో టీ నీళ్ల తాగడానికి కూడా డబ్బులు లేవని ఆమె వాపోతోంది.


బాధిత వృద్ధురాలు గంగమ్మ

పింఛను పునరుద్ధరించాలి : టిడిపి
ఇదేం కర్మా రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనూరు మల్లునాయుడు ఆదివారం రాత్రి గ్రామంలో ఇంటింటికి వెళ్లారు. ఈ సమయంలో తన పింఛను నిలిపి వేసిన విషయాన్ని గంగమ్మ తెలిపింది. దీనికి స్పందించిన టిడిపి నేతలు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 80 ఏళ్ల పైబడిన వృద్ధురాలికి పింఛను నిలిపివేయడం దారుణమని, తక్షణమే పింఛను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

అరకొర సాయంతో ఇళ్ల నిర్మాణం ఎలా?

సిపిఐ ఆధ్వర్యాన ధర్నాలు

ప్రజాశక్తి -కొత్తకోట
జగనన్న కాలనీ లబ్ధిదారులకు రెండు సెంట్లు స్థలం కేటాయించి, గహ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలనీ డిమాండ్ చేసూ_్తరావికమతం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీపీఐ, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్బంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శివలంక కొండలరావు, సిపిఐ మండల కార్యదర్శి జి.జోగిరాజు తదితరులు మాట్లాడుతూ జగనన్న కాలనీ పేరుతో కేవలం ఒక్కో సెంటు స్థలం ఇచ్చి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇస్తే నిరుపేదలు ఇళ్ల నిర్మాణాన్ని ఎలా పూర్తిచేసుకోగలరని ప్రశ్నించారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ కార్యకర్త మాలిచేట్ల పరశురామ్ పలువురు ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

గొలుగొండ : గొలుగొండలో సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశరు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ స్థలం, పక్కా గృహం నిర్మించి పేదలకు అందజేస్తామని హామీనిచ్చిన వైసిపి ప్రభుత్వం, సెంటు జాగా ఇచ్చి, ఇంటి నిర్మాణానికి 1.80లక్షలు మాత్రమే ఆర్థికసాయం ఇస్తామని చెప్పి చేతులు దులుపుకుంటోందని, ఇలాగైతే పేదల సొంతింటి కల ఎలా సాకారమౌతుందన్నారు.. జగనన్న కాలనీలో తాగునీరు,విద్యుత్ రోడ్లు సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి మేకా సత్యనారాయణ, సిపిఐ మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, కార్యవర్గ సభ్యులు ఎం.సత్యనారాయణ, బాబులు, ఎల్.సత్యనారాయణ, పి.ప్రసాద్, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

దేవరాపల్లి : జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం ఇవ్వాలని సిపిఐ నాయకుఏలు వేమల కన్నబాబు డిమాండ్ చేశర. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ డి.అరుణ్ చంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాము, దేవుడిబాబు, అమ్మతల్లి పాల్గొన్నారు

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలని...
అనకాపల్లి : టిడిపి ప్రభుత్వ హయాంలో ఎంపిక చేసిన పట్టణ పేదలకు కేటాయించిన టిడ్కో గృహాలను తక్షణమే లబ్ధిదారులకు అప్పగించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించి, జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ లబ్ధిదారులను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వైఎన్ భద్రం, చెల్లూరి నాగరాజు, రాజాన దొరబాబు, తాకాసి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు అబ్బులు, కోరిబిల్లి శంకర్రావు, బోయిన గోవింద, రామచంద్రరావు పాల్గొన్నారు.

రజకుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - దేవరాపల్లి : మండలంలోని రజకుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు అన్నారు. మండల రజక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాకుళపు సత్యనారాయణ, యల్లపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం రజకులు ఎంపీపీని కలిసి రేవు ప్రాంతంలో షెడ్లు నిర్మాణం, ప్రభుత్వ పథకాలు అమలు తదితర సమస్యలపై వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందించిన రాజేశ్వరి తన దృష్టికి వచ్చిన సమస్యలను ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడుకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొరువాడ పాలవెల్లి, జాజిమొగ్గల లక్ష్మి, అలుగోలు సత్యవతి, కొడమంచిలి ఈశ్వరమ్మ పాల్గొన్నారు.


ఎంపిపికి వినతిపత్రం ఇస్తున్న రజకులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు

ఆశా వర్కర్స్ యూనియన్ మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : విజయనగరంలో ఈనెల 12, 13 తేదీల్లో జరగనున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్‌ను సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శాంతి, ఈ.పార్వతి, కోశాధికారి సూర్యకళ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు ఈ మహాసభకు 27 జిల్లాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. ఆశాలు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభను జయప్రదం చేయాలన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : పదేళ్ల లోపు పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించడం అన్యాయమని, తక్షణమే ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూక అప్పారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని 2019 ఎన్నికల ముందు హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి, నేడు వారిని తొలగింపునకు దొడ్డిదారిన జిఒ విడుదల చేయడం దారుణమన్నారు. దీనివల్ల అనేకమంది వికలాంగులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమావేశంలో చెట్ల సన్యాసిరావు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలింపుపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : అక్రమంగా గ్రావెల్ తరలింపుపై స్పందనలో జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి టిడిపి మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యాన సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని పాటిపల్లి పంచాయతీ సర్వే నంబర్ 112, 113 పరిధిలోని గ్రావెల్ కొండను రెవెన్యూ అధికారులు, వైసీపీ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఒక్కటై తవ్వేసి గ్రావెల్ దందా జరుపుతున్నారని ఆరోపించారు. జగనన్న కాలనీలకు అని చెప్పి అమ్ముకుంటున్నారన్నారు. అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో టిడిపి నాయకులు శ్రీనివాసరావు, ఆడారి జనార్ధన్, కొయ్య రమణ, పోలమరశెట్టి మురళి, నవీన్, బొడ్డేడ శ్రీను, ఎర్ర రాము ఉన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలకు చర్యలు

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : జగనన్న కాలనీల్లో పట్టాలు పొందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎలమంచిలి ఎమ్మెల్యే యువి రమణ మూర్తి రాజు అధికారులను ఆదేశించారు. స్థానిక పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీడీవో రవికుమార్, డిప్యూటీ తహశీల్దారు వినయ్, ఈవోపీఆర్డీ ఈశ్వరరావు, వైసీపీ మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి రాజు

ప్రజాశక్తి 7
మంగళవారం 6 డిసెంబర్ 2022

ఇనాం భూముల సర్వేపైనే ఆశలు!



జెపి అగ్రహారంలో ఇనాం భూములు

- తరాలుగా సాగులో ఉన్నా, హక్కుపత్రాలు లేక రైతుల అవస్థలు
- ఇనాం భూములని కాజేసేందుకు కబ్జారాయుళ్ల యత్నం
- కోర్టును ఆశ్రయించిన జెపి.అగ్రహారం సాగు రైతులు

ప్రజాశక్తి-రోలుగుంట : ఇనాం భూములను సర్వేచేసి హక్కులు కల్పిస్తామన్న ప్రభుత్వ ప్రకటన జెపి అగ్రహారం సాగుదారులకు ఆశాదీపంలా కనిపిస్తోంది. శతాబ్ధాలుగా తాతముత్తాల నుంచి సాగులో ఉన్నప్పటికీ, హక్కు పత్రాలు లేకపోవడంతో అన్నింటికీ చెడిన మూడు గ్రామాల రైతులు, ఇపుడు జీవనాధారమైన భూములపై కబ్జాదారుల కన్నుపడడంతో అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. ఇపుడు వైసిపి ప్రభుత్వం చేసిన ఇనాం భూముల సర్వేపైనే ఆశలు పెట్టుకున్నారు.

మండలంలో జెపి.అగ్రహారం గ్రామానికి చెందిన రైతులు తాతముత్తాతల నుంచి గడచిన నాలుగు శతాబ్ధాలుగా 450 ఎకరాలను మూడు గ్రామాలను చెందిన సుమారు 350 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. జెపి.అగ్రహారం, రొంగలపాలెం, నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామస్థులు ఈ భూముల సాగుతోనే ఇన్నాళ్లుగా జీవనాధారం పొందుతున్నారు. 1912లో గిల్‌మెన్ సర్వే చేసి 1-32 సబ్ డివిజన్ చేసి రైతుల పేరున సర్వే చేసినట్లు అప్పట్లో గ్రామ పెద్దలు తెలియజేశారు. వారి పేరున ఫెయిర్ అడంగల్ కూడా ఉన్నట్లు చెబుతున్నారు. 1950లో ఎస్ఆర్ 35/50 రైత్వారీ చట్టం కింద గ్రామస్థులకు ఇచ్చార. ఆ తర్వాత తరం వారికి దీనిపై పూర్తిగా అవగాహన లేక సాగులో ఉన్నాం ప్రభుత్వ అధికారులే న్యాయం చేస్తారన్న ధీమాతో ఇన్నాళ్లుగా నెట్టుకొస్తున్నారు.

అయితే రికార్డుల పరంగా రైతుల పేర్లు నమోదు కాకపోవడంతో ప్రభుత్వం తరపున వచ్చే సంక్షేమ పథకాలు వీరికి వర్తించడం లేదు. ఇళ్లనిర్మాణం, పెళ్లిళ్ళు, ఇతర ఎంతటి అత్యవసరం వచ్చినా ఆన్‌లైన్‌లో భూరికార్డు లేకపోవడంతో అమ్ముకునే వీలులేనిస్థితిలో వారంతా ఆవేదనకు గురవుతున్నారు. రైతులకు రికార్డెడ్ ఆధారాలు లేని విషయాన్ని గమనించిన కొందరు 2014లో ఆభూమిపై కన్ను వేసి ఇది ఇనాం భూమి అని, ఇనాందారులైన నక్కపల్లి గ్రామానికి చెందిన నున్నా వారికి ఈ భూమిపై హక్కు ఉందని, 1/3 వంతు వారికి చెందుతుందని రైతులను మోసం చేయడానికి ప్రయత్నించారు. దీన్ని కొందరు రైతులు గమనించి రోలుగుంట తహశీల్దార్ కార్యాలయంలో పూర్తి సమాచారం తీసుకొని హైకోర్టును ఆశ్రయించారు. దీనికి ముందు 2021లలో అప్పటి తాజా మాజీ సర్పంచ్‌లు ఇద్దరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఈ భూములను కాజేసేందుకు యత్నించారని, ఈ మేరకు కోట్ల రూపాయల చేతులు మారినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారులంతా వారికే వత్తాసు పలికేవారన్నారు.. దాంతో గ్రామస్థులంతా ఒకేతాటిపైకి వచ్చి జిల్లా అధికారులకు స్పందనలో దరఖాస్తు చేసుకున్నారు. గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారులు, జిల్లా నాయకులు కలిసి రావులపాలెం రాజు దగ్గర కోట్ల రూపాయలు చేతులు మారిన విషయం ప్రజలందరికి తెలియడంతో యువత దీనిపై పూర్తి బాధ్యత వహించారు. కోర్టును ఆశ్రయించారు. ఇటీవల ఇనాం భూములు సర్వే చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

తహశీల్దార్ వివరణ

మండలంలో జెపి.అగ్రహారం ఇనాం భూమి విషయంలో మండల తహశీల్దార్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా దీనిపై జిల్లా కలెక్టర్ దగ్గర ఫైల్ ఉందని, జిల్లా అధికారుల నిర్ణయం మేరకు సర్వే జరిపిస్తామన్నారు. తన పరిధిలో లేదని వివరణ ఇచ్చారు. రైతులు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు జిల్లా అధికారుల నిర్ణయం ఆధారపడి ఉందని తెలిపారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



కోటవురట్లలో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి -మాడుగుల : వేతనాల పెంపుపై ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఎంపిపి పెదబాబు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్, ఉప ముఖ్యమంత్రి బూ డి ముత్యాల నాయుడు చిత్రపటాలకు మాడుగులలో పాలాభిషేకం నిర్వహించారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, వైసిపి గ్రామ శాఖ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యస్ రాయవరం : తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు జీతాలు పెంచిన సిఎం జగన్ చిత్రపటానికి మద్యం దుకాణాల ఉద్యోగులు పాలాభిషేకం నిర్వహించారు. సోమవారం కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గొల్లబాబూరావును కలసి పూలమాలతో సత్కరించారు.

కోటవురట్ల : మద్యం షాపుల సిబ్బందికి వేతనాలు పెంపుపై సోమవారం వర్షం వ్యక్తం చేశారు, సూపర్వైజర్లకు రూ.17,500 నుంచి రూ.21500 వరకు పెంచగా, సేల్స్‌మెన్లకు రూ.15 వేల నుండి రూ.17,500కు పెంచడంతో పలు గ్రామాల్లో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక



కొత్త అధ్యక్ష, కార్యదర్శులకు అభినందన

ప్రజాశక్తి -మాకవరపాలెం : మండలంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా రాచపల్లి పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాకవరపాలెం పంచాయతీ కార్యదర్శులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఎంపిడిఒ అరుణశ్రీ అభినందనలు తెలిపారు

భూహక్కు పత్రాల పంపిణీ



పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : జగనన్న భూహక్కు, ౹ భూరక్ష పథకం కింద భూయజమానులకు సోమవారం సాయంత్రం అడ్డురోడ్డులోని శ్రీనివాసా ఫంక్షన్ హాలులో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి అవకతవకలు రికార్డు గల్లంతులు లేకుండా భూమి యజమానికి డిజిటలైజ్ చేసిన పాసుపుస్తకాలు పంపిణి చేస్తున్నామన్నారు. భూ రక్ష పథకం కింద యాజమాన్యపు హక్కు పత్రాన్ని ఇవ్వడం ద్వారా రైతులకు ధైర్యాన్ని, భరోసాను ప్రభుత్వం కల్పించిందన్నారు. కబ్జాలు రెవెన్యూ రికార్డుల గల్లంతు లాంటివి లేకుండా భూమి కలిగిన ప్రతీ ఒక్కరు ధైర్యంగా ఉండేలా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు పథకం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అధికారులు,పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

అసంపూర్తి కాలువతో అవస్థలు

ప్రజాశక్తి -కోటవురట్ల: చిన్న లింగాపురం గ్రామం నుంచి చేపట్టిన మురుగునీటి కాలువను తహశీల్దార్ కార్యాలయం వరకు చేపట్టి అర్ధాంతరంగా వదిలేయడంతో పరిసర ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, 2019లో ఈ కాలువ పనులను వదిలేయడంతో మురుగు పేరుకుపోయి, దోమల బెడదతో పాటు దుర్గంధంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా తహశీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల మీద పలుగ్రామాల నుంచి వచ్చేవారంతా ముక్కు మూసుకోవలసిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువ నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

9న ఎపిసిసి ప్రమాణస్వీకారానికి తరలిరండి



విజయకుమార్‌ను అభినందిస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి -పాయకరావుపేట : విజయవాడలో ఈనెల 9న ఎపి కాంగ్రెస్‌కమిటీ అధ్యక్షునిగా గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్లు జంగా గౌతమ్, మస్తాన్ వలి, సుంకర పద్మశ్రీ, రాకేష్ రెడ్డి, ఇతర కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారానికి పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పాయకరావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి తాళ్లూరు విజయకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పాయకరావుపేట పట్టణంలోని లింగాల కాలనీలో సమావేశంలో నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖపట్నం నగర అధ్యక్షుడు గోంప గోవింద్, ఎపిసిసి సమన్వయ సభ్యుడు రుత్తల శ్రీరామ్మూర్తి, ఎపిసిసి ప్రధాన కార్యదర్శి, మాడుగుల, చోడవరం, పెందుర్తి, యలమంచిలి నియాజకవర్గాల కాంగ్రెస్ ఇన్‌ఛార్జులు బొడ్డు శ్రీనివాసు, గునూరు వెంకట్రావు, ఆడారి రమేష్ నాయుడు, కుండ్రపు అప్పారావు, పాయకరావుపేట పట్టణ అధ్యక్షుడు పెరుమాళ్ల వెంకటరమణ, జిల్లా నాయకులు దగ్గుపల్లి బాలరాజు, ఎస్‌కె.సాహ యుగంధర్, బైపురెడ్డి శేషుబాబు, ప్రగడ చక్రి, గారా అర్జున్ పాల్గొన్నారు.

బంగారమ్మపాలెంలో కొనసాగుతున్న మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ మత్స్యకారుల ధర్నా సోమవారం కూడా కొనసాగింది. వాకపాడు శివారు బంగారమ్మపాలెంలో ఎన్ఎఒబి గేటు వద్ద దర్నా నిర్వహిస్తున్నారు. 15 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందించారు. అధికారులు వస్తున్నారు, వెళ్తున్నారు తప్ప తమ సమస్యలు పరిష్కారం కాలేదని ఆందోళనకారులు వాపోతున్నారు మత్స్యకారులకు ఇవ్వాల్సిన ప్యాకేజీలతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించేవరకు ధర్నా విరమించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు, ఎంపిటిసిలు గ్రామస్థులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న మత్స్యకార యువకులు

తాటిపర్తిలో ఫ్యామిలీ ఫిజీషియన్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి -మాడుగుల: ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా మండలంలోని తాటిపర్తిలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. కె.జెపురం పిహెచ్‌సి వైద్యాధికారి ఎల్ వి.ఎస్ ఎస్ ప్రసాద్ పాత్రుడు ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్, వైద్య సిబ్బంది వెంకట్, సురేష్ సువర్ణ ,హేమమాలిని ఆధ్వర్యంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలికంగా ఇళ్లల్లో మంచానికే పరిమితమైన రోగులకువారి ఇళ్ల వద్దకు వెళ్లి పరీక్షలు చేశారు గ్రామానికి చెందిన జుత్తాడా మోక్షిత్ నాయుడు అనే ఐదేళ్ల బాలునికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

డిగ్రీ కాలేజీ విద్యార్థులకు ఓటు హక్కు నమోదుపై అవగాహన



మాట్లాడుతున్న తహశీల్దార్ పివి.రత్నం

ప్రజాశక్తి-మాడుగుల : 18ఏళ్ల నిండిన అర్హులైన ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తహసీల్దారు పివి. రత్నం అన్నారు. సోమవారం మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య భారత దేశంలో పౌరులుగా ప్రతిఒక్కరూ ఓటు హక్కును కలిగి, దాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య యుతంగా పాలకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు మైక్రోసాఫ్ట్ సర్టిఫైడ్ కోర్సులో అర్హత సాధించిన విద్యార్థులు అధ్యాపకులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పెదబాబు, ప్రిన్సిపల్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి,సర్పంచ్ కళావతి కళాశాల అభివద్ధి సంఘం చైర్మన్ శ్రీనాథ్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామ్ కుమార్, ఇతర అధ్యాపకులు షర్మిల, పైడిరాజు, సులోచన, రాజు పాల్గొన్నారు

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో రూ.కోటితో చేపట్టిన పలు అభివృద్ధి పనులను అనకాపల్లి ఎంపీ భీశెట్టి వరహాసత్యవతి, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతి మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే గణేష్ ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పేట ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీ సత్యవతిని కోరిన వెంటనే రూ.కోటి నిధులు మంజూరుకు సహకరించాలన్నారు.

నియోజకవర్గ ప్రజల తరఫున ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలో పలు వార్డుల్లో రోడ్లను ఎంపీ సత్యవతి ప్రారంభించారు కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, వైసిపి సీనియర్ నేత చింతకాయల సన్యాసి పాత్రుడు, వార్డు కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షులు ఏకాశివ వార్డు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

370వ రోజుకు మత్స్యకారుల ధర్నా



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : హెటిరో పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకార జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత మహా ధర్నా సోమవారం నాటికి 370 వ రోజుకు చేరింది. శిబిరం వద్ద మత్స్యకారులు పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. మత్స్యకారుల జీవన విధానానికి నష్టం కలిగించే పైప్‌లైన్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.సిపిఎం గ్రామ కార్యదర్శి మైలపల్లి మహేష్ బాబు, మత్స్యకారులు గోసల సోమేశ్వరరావు, వాసిపల్లి నూకరాజు, చేపల సోమేష్, మైలపల్లి జాను, మైలపల్లి బాపూజీ, మైలపల్లి శివాజీ, కొత్వాల కాశి , కొడ కాశి కారే కోదండరావు పాల్గొన్నారు

మంచు సోయగం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల వ్యాప్తంగా సోమవారం మంచు కురియడంతో ఆహ్లాదకర వాతావరణం చోటుచేసుకుంది, ఉదయం నుండి 9:30 గంటల వరకు మంచు దట్టంగా కురియడంతో ప్రకృతి ప్రేమికులు పరవశించిపోయారు. అదే సమయంలో వేకువనుంచే జీవనయానంలో పడిపోయిన అనేక మంది కొంచం ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా వాహన చోదకులు, రైతులు, పారిశుధ్య కార్మికులు దినసరి చర్యలు చేసుకునేందుకు ఆటంకం ఏర్పడుతుంది, అల్పపీడన కారణంగా చలి తీవ్రత మాత్రం తగ్గుముఖం పట్టింది.



దట్టంగా అలుముకున్న పొగమంచు

ప్రయివేటీకరణ ఆపకుంటే కేంద్రానికి బుద్ధి చెబుతాం

ప్రజాశక్తి - ఉక్కునగరం : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణపై వెనక్కుతగ్గకుంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 662వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ డబ్ల్యుఎమ్‌డి, యుటిలిటీస్, ఎస్ఎస్‌డి, టిటిఐ, టౌన్ అడ్మిన్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు వై.మస్తానప్ప, జె.రామకృష్ణ, ఎ.మసేన్‌రావు, సిహెచ్.సన్యాసిరావు, గుమ్మడి నరేంద్ర, డి.శ్రీనివాస్ మాట్లాడారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న స్టీల్ కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలన్న కుట్రతో కేంద్ర ప్రభుత్వం వేతన సవరణ ప్రక్రియను నిలిపివేసిందన్నారు. అక్కడితో ఆగక ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో కలిసి ఆడుతున్న ఈ నాటకాలను కార్మికులు గుర్తించారన్నారు. మొండిగా ముందుకెళ్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. దేశ వ్యాప్తంగా స్టీల్‌ప్లాంట్ కార్మికుల పోరాటానికి మద్దతు దక్కుతోందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజేశ్వరరావు, జి.ఈశ్వరరావు, నాగార్జున, వి.ప్రసాద్, సత్తి సింహాచలం పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ధర్నా



ధర్నాలో పాల్గొన్న గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

బోయ/వాల్మీకి సహా ఇతర కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని, తక్షణం జిఒ నెంబర్ 52ను రద్దు చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఛైర్మన్ చక్రి నాయక్ డిమాండ్ చేశారు. బోయ/వాల్మీకి కులాలను గిరిజన జాబితాలోకి చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరినైనా ఎస్‌టిలుగా పరిగణించాలంటే వారు కొండ ప్రాంతంలో ఉండాలని, వారికి ప్రత్యేకమైన భాష ఉండాలని తెలిపారు. రాజకీయ స్వలాభం కోసం కొత్తవారిని ఎస్‌టి జాబితాలో చేర్చాలని చూడటం తగదన్నారు. మైదాన ప్రాంతంలో ఉన్నవారు ఆర్థికంగా ఇప్పటికే అభివృద్ధి చెంది ఉన్నారని, వారిని ఎస్‌టి జాబితాలోకి చేరిస్తే అన్ని విధాలా వారే ఎదుగుతారని అన్నారు. ప్రభుత్వం పునరాలోచించి జీవో నెంబర్ 52ను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరాబు సత్యనారాయణ, రుడా సత్యా రావు మాట్లాడుతూ ఇతర కులాలను గిరిజన జాబితాలో చేర్చడం వల్ల అసలైన గిరిజనులకు జరిగే నష్టం అంతా ఇంతా కాదన్నారు. అడవులను, గనులను బడాబాబులకు, బహుళ జాతి సంస్థలకు ధారాదత్తం చేయడం కోసం ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

చెట్లు నరికివేతపై ఫిర్యాదు

ప్రజాశక్తి-మాకవరపాలెం : మండలంలో ఎన్నో ఏళ్ల నుంచి సాగులో ఉంటున్న తమ భూమిలో ఉన్న మామిడి చెట్లను వెంకన్నపాలెం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు నరికేశారనిసెట్టిపాలెం గ్రామం శివారు వెంకన్నపాలెం గ్రామానికి చెందిన రెడ్డి లక్ష్మి, రెడ్డి నాయుడమ్మ అనే బాధిత మహిళలు స్థానిక ఎస్ఐ రామకష్ణారావుతో పాటు జిల్లా ఎస్‌పికి స్పందనలో ఫిర్యాదు చేశారు. వచ్చిన ఫిర్యాదు పై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీనిచ్చారు.

వైసిపి పాలనలో బిసిలకు అన్యాయం

టిడిపి ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని టిడిపి బీసీ సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర అన్నారు. సోమవారం టిడిపి నాయకులు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ టిడిపి పాలనలో కులవృత్తులను ప్రోత్సహిస్తూ ఆదరణ పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేసినట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం బిసి కార్పొరేషన్‌ను చిన్నాభిన్నం చేసి కులానికో కార్పొరేషన్ పెట్టి, వాటికి నిధులు ఇవ్వడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొణతాల రత్నకుమారి, పోలవరపు త్రినాథ్, సబ్బవరపు గణేష్, శంకర్ల పద్మ లత, పిట్ల రాజు, మారిశెట్టి శంకర్రావు, తిప్పాన అప్పారావు, చదరం శివ అప్పారావు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం టిడిపి బీసీ సెల్ మండల కమిటీ అధ్యక్షులు మొల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముందు మెయిన్ రోడ్ నుండి ర్యాలీ నిర్వహించారు. 'ఇదేమి కర్మ మన రాష్ట్రానికి' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు దాడి ముసలి నాయుడు, మళ్ల వరాహనరసింగరావు, ఆడారి అబ్బాయి నాయుడు, వెలగా మురళి, పెంటకోట శ్రీరామ్మూర్తి, ఆడారి లక్ష్మణరావు, విల్లూరి నరసింహరావు, గోవిందు ప్రసాద్, శరగడం నాగేశ్వరరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మాకవరపాలెం. : రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారని మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లు రామనాయుడు అన్నారు. సోమవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికే కార్యక్రమంలో భాగంగా తహశీల్దార్ కార్యాలయం ముందు టిడిపి శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ముందుగా తామరం నుంచి మాకవరపాలెం రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. తహశీల్దార్ ప్రసాదరావుకు వినతిపత్రం అందించారు.కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి చిరంజీవి, మండల ప్రధాన కార్యదర్శి గోవిందు, మండల యూత్ అధ్యక్షుడు సురేష్, తెలుగు యువత మండల అధ్యక్షురాలు అల్లంపెల్లి శిరీష, శేషు కుమార్, జోగుపాతుడు పాల్గొన్నారు



గొలుగొండలో నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

గొలుగొండ : తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో గొలుగొండ మండలంలో ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో బీసీలకు కులవృత్తిదారులకు పనిముట్లు ఇచ్చేవారని,ఆదరణ పథకానికి వైసిపి ప్రభుత్వం మంగళం పాడేసిందన్నారు.. సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారన్నారు. వాటిని పునరుద్దరించాలని డిమాండ్ చేశారు.బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలన్నారు.

విఆర్‌ఒకు షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలో ఎంకె.పట్నం రెవెన్యూ పరిధి పెదపేట సమీపంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన విఆర్‌ఒ రాజులమ్మకు ఆర్‌డిఒ షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీనిపై రెండు రోజుల క్రితం తహశీల్దార్ వెంకటేశ్వరరావు విచారణ చేపట్టి, కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నర్సీపట్నం ఆర్డీవో జయరాం షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తహశీల్దార్ తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడిన భూయాజమానితో పాటు తవ్వకాలు చేసిన వాహన యాజమానిపై కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్‌లోనూ భూమి తనదే కదా అని భూయాజమానులు ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు పాల్పడవద్దని హెచ్చరించారు. ముందుగా అనుమతులు పొందాలని సూచించారు.

టిడిపి నేత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-మాకవరపాలెం : మండలం లో జీ కోడూరు గ్రామంలో ఇటీవల చనిపోయిన టిడిపి మాజీ ఎంపీటీసీ శివ సత్యనారాయణ కుటుంబానికి టిడిపి శ్రేణులు రూ.పది వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా శెట్టిపాలెం సర్పంచి అల్లు రామనాయుడు మాట్లాడుతూ పార్టీలో చురుకైన పాత్ర పోషించే సత్యనారాయణ చనిపోవడం టిడిపి పార్టీకి తీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో జోగుపాత్రుడు, జి కోడు టిడిపి నాయకులు జైరాం మండల యూత్ అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు

బ్యాంకు పథకాలపై అవగాహనకు ఊరూరా కళాజాతా



బ్యాంకు ఉద్యోగికి అభినందన

ప్రజాశక్తి -మాకవరపాలెం : మండలంలో కొండల అగ్రహారం ఎపి గ్రామీణ వికాస బ్యాంకు ఆధ్వర్యంలో పైడిపాలెం, లచ్చన్నపాలెం గ్రామాలలో కెఎస్. రూరల్ మీడియా కళాజాత బృందం ఆధ్వర్యంలో పాటలు, నృత్యాలు, మ్యాజిక్ షో ద్వారా బ్యాంకు పథకాలు , ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, గోల్డ్ లోన్స్, వ్యవసాయ ఋణాలు, డ్వాక్రా రుణాలు, వాహన, విద్యారుణాలు వికాస్ 666, వికాస్ 999 పథకాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు,ప్రజలకు డిజిటల్ లావాదేవీలు, ఎటిఎం కార్డ్ ఉపయోగం, సైబర్ మోసాలపై వివరించారు కళాకారులు గంగాధర, చిదంబరేష్ పాల్గొన్నారు.